క్లుప్తంగా

అవగాహనతోనే వ్యాధుల నియంత్రణ



మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రవీందర్

జగిత్యాల: అవగాహనతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమని ఐసీటీసీ కౌన్సిలర్ రవీందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు వ్యాపించే తీరుపై అవగాహన ఉంటే వాటిని నియంత్రించడం సులభమన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాపించడానికి కారణాలు నిరోధకానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీటీఎస్ రాజు, లింక్ వర్కర్ పద్మ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గానికి సన్మానం

ధర్మపురి: ధర్మపురి మార్కెట్ కమిటీకి నూతనంగా నియమితులైన చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంగ నర్సింహులను శనివారం మండల పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశరు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వేముల రాజేశ్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్ కాల్‌తో పశువైద్య సేవలు

ధర్మపురి: అత్యవసర సమయంలో ఒక్క ఫోన్ కాల్‌తో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.కె. సలీమ్ అన్నారు. ధర్మపురి పట్టణంలో శనివారం 1962 సేవలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 1962 వాహనం ద్వారా సంచార వైద్య సేవలు అందిస్తున్నామని ప్రమాదంలో గాయపడిన వాటికి, అనారోగ్యాలతో బాధపడుతున్న మూగ జీవాలకు వైద్య సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు సాయితేజ, పారావెట్ మల్లేశ్, హెల్పర్ శంకర్, కెప్టెన్ రాకేశ్ పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

జగిత్యాలక్రైం: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఏఎస్సై నజీముద్దీన్ అన్నారు. శనివారం సాయంత్రం జగిత్యాల కొత్తబస్టాండ్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస అయితే తమ భవిష్యత్ అంధకారమవుతుందని, విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని, సెల్‌ఫోన్లు వాడేటప్పుడు వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకోవాలని, ఆగంతకులు పంపే మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు అనిల్, చంద్రశేఖర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నందించాలి

మెట్‌పల్లి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని సైకాలజిస్ట్ రాజారత్నాకర్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాజారాం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి లావణ్య, హెచ్ఎం పొట్ట రాజనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిపెట్టాలి

సారంగాపూర్: ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయని, పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని అధ్యాపకులు కోరారు. మండలంలోని పోతారం, బట్టపల్లి గ్రామాల్లోని కళాశాల విద్యార్థుల తల్లితండ్రుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. పరీక్షలకు మరో నాలుగు మాసాలే పరీక్షలకు సమయంలో ఉందని, విద్యార్థులు కళాశాలకు రావడం, ఇంటి వద్ద చదువుపై దృష్టిసారించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు రాజు, శ్రీధర్ ఉన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

కథలాపూర్: విద్యార్థులు చదువుల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హెచ్ఎంలు అన్నారు. శనివారం కథలాపూర్ మండలం సిరికొండ, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం విద్యార్థులను పాఠశాలల్లో సన్నద్ధం చేస్తున్నామని, ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సెల్‌ఫోన్, టీవీలకు విద్యార్థులను దూరంగా ఉంచాలన్నారు. సమావేశాల్లో హెచ్ఎంలు రాజయ్య, శ్రీనివాస్, అనిత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.. అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారుతోంది. ఈ ఇద్దరు నేతలు ఎవరికి వారు తమ మాటే చెల్లుబాటు కావాలన్న రీతిలో వ్యవహరిస్తుండడంతో అధికార యంత్రాంగం పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఏ సమస్యపై ఎలాంటి చర్యలు చేపడితే ఎవరికి కోపం వస్తుందోనని అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

కల్వకుంట్ల వర్సెస్ జువ్వాడి



కలిసి కదిలితే మేలు

- అడకత్తెరలో అధికారులు
- కోరుట్ల సెగ్మెంట్‌లో కలకలం

- కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో ఇద్దరు నేతల తీరు పలు వివాదాలకు కారణమైంది.
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కొంత విబేధాలు వచ్చినా సమస్య సమసిపోయింది.
- ఎల్‌వోసీ, సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో ఇద్దరి మధ్య ఇబ్బంది రాకుండా వ్యవహరించడానికి స్థానిక అధికారులు సతమతమవుతున్నారు.
- ఇటీవల ప్రభుత్వపరంగా జరిగిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకల్లో ప్రోటోకాల్ పాటించడం అధికారులకు సమస్యగా మారింది.
- కోరుట్లలో కీలకమైన కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేసిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహం ఏర్పాటులోనూ వివాదం నెలకొంది.
- కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో ఇటీవల జనరల్ ఫండ్ కేటాయింపు విషయంలోనూ వివక్ష చూపుతున్నారన్న దుమారం తెరపైకి వచ్చింది.
- మెట్‌పల్లిలోని బస్టాండ్ ఏర్పాటు అంశం తీరు ఇలాగే ఉంది.
- ఇలా తరచూ సెగ్మెంట్‌లోని ఇద్దరు కీలక నేతల మధ్య పలు అంశాల వారీగా వివాదాలు నెలకొనడంతో సంక్షేమ పథకాల, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు అధికారులు అడుగడుగునా ఇబ్బంది పడుతున్నారు.

ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.. అధికారపక్షానికి చెందిన నేత జువ్వాడి నర్సింగరావు కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నామని ఎవరికి వారు చెబుతున్న మాట వాస్తవమే అయినా.. అధికార యంత్రాంగం ఇబ్బంది పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయపరంగా నెలకొన్న విభేదాలు అభివృద్ధి పనులకు అడ్డుకారాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులు, సంక్షేమం విషయంలో తాము కలిసి వస్తామని ఇద్దరు చెబుతున్నా అంతర్గతంగా పలు విబేధాలు పొడచూపుతున్న నేపథ్యంలో అధికారులు సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకోవడం కత్తిమీద సాముగా మారింది. కోరుట్ల సెగ్మెంట్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కీలక నేతలు ఇరువురు కాస్త సమన్వయంతో వ్యవహరిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మరమ్మతుకు రూ.1.30 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శనివారం విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన సీతారాముల గుడి ఆవరణ అభివృద్ధికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.83 లక్షల నిధులు మంజూరు చేయడంతో బీసీ సెల్ మండల అధ్యక్షుడు మరిపెల్లి స్వామిగౌడ్ ఆధ్వర్యంలో కొండాపూర్ గ్రామస్తులు, నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముస్కెం జలందర్, కృష్ణ, చిట్యాల రాజేష్, డప్పు ప్రెంసాగర్, జంగిలి స్వప్న, నాగరాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు నిరసిస్తూ ఆందోళన



రాయికల్‌లో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

రాయికల్: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిపై దాడిచేసిన దుండగుడిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం రాయికల్ పట్టణంలోని నవదుర్గ, సంఘమిత్ర, చండీపరివార్ భక్తులు, పట్టణంలోని హిందువాదులంతా గాంధీచౌక్ నుంచి అంగడిబజార్, తహసీల్ కార్యాలయం మీదుగా పోలీస్‌స్టేషన్‌కు భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందు దేవుళ్లపై జరుగుతున్న దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అమ్మవారి సేవ సమితి సభ్యులు, భక్తులు, యువతరం సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: హిందూ ఆలయాలపై దాడులు, విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇస్లామిక్ మతోన్మాద శక్తులు ఆలయాలపై దాడులకు పాల్పడుతూ మత కలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. వీరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోహార్ తుక్కారాం, మర్రి భాస్కర్, గట్టిడి విజయ్, గుండు ప్రభాకర్, ముక్క నరేశ్, సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు చేసిన దుండగులను శిక్షించాలి

జగిత్యాల: సికింద్రాబాద్‌లోని ముత్యాల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం, సంగారెడ్డి జిల్లా సదాశివరెడ్డిపేటలో హనుమాన్ విగ్రహం ముఖం, కాళ్లు, చేతులు చెక్కినటువంటి దుండగులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పద్మాకర్, సంతోష్, రాములు, రోహిత్, అరుణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మల్లేశ్

జగిత్యాలక్రైం: ప్రతీ విద్యార్థికి విద్యతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. శనివారం నవ్య బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపల్ గాలిపల్లి ఈశ్వర్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య అకాడమీలో ధర్మపురి వాసులకు చోటు



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

ధర్మపురి: మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహారాష్ట్ర తెలుగు అకాడమీలో ధర్మపురి, బుగ్గారం మండలవాసులకు చోటు దక్కింది. ధర్మపురికి చెందిన, మహారాష్ట్ర స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడు, పాత్రికేయుడు గుండారపు శ్రీనివాస్, బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికి చెందిన తెలుగు రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కవి, రచయిత సంగవేని రవీంద్రను నియమిస్తూ పత్రాలు అందించారు. ముంబయి మాటుంగాలోని మైసూర్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ డైరెక్టర్ సచిన్ నింబాల్కర్ కార్యవర్గాన్ని ప్రకటించారు.

రవీందర్ సింగ్ ఎమ్మెల్సీగా గెలవాలని పాదయాత్ర

కొండగట్టు: పట్టభద్రుల ఎమ్మెల్సీగా సర్దార్ రవీందర్ సింగ్ గెలవాలని కరీంనగర్ జిల్లా వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం వరకు శాతవాహన స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో వివిధ యూనివర్సిటీల పట్టభద్రులు శనివారం పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తవుటు మురళి, గొట్టం మహేష్, పొన్నం అనిల్ గౌడ్ కొత్తకొండ శ్రావణ్, రాము, యూనివర్సిటీల జేఏసీ నాయకులు అరుణ్ కుమార్, సత్యనారాయణ, రాము యాదవ్, నైతే మహేశ్, బండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు పత్రాలు పంపిణీ

మల్యాల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూటీఎస్ నాయకులు టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తులు పంపిణీ చేశారు. మండలంలోని రామన్నపేట, నూకపల్లి, రాంపూర్, ఒబులాపూర్, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు-19 అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అబ్దుల్ జమీల్, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ ఉపాధ్యక్షుడు లింగాల శంకరయ్య, మల్యాల మండల ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభలు

పెగడపల్లి: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈజీఎస్ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టనున్న పనుల గుర్తింపునకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ప్రాధాన్యత గల పనులు ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో అనిల్, ఏపీఎం సమత, టీఏ రాజేశం, కారోబార్ స్వామి,అంగన్‌వాడీ టీచర్లు,వీవోఏలుపాల్గొన్నారు.

విద్యార్థి చేతికి గాయం

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తరి సాత్విక్‌ను ఓ ఉపాధ్యాయుడు నెట్టివేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు ఈనెల 17న స్కూల్‌లో 9వ తరగతి గదిలో ఇద్దరు విద్యార్థులు నోట్ బుక్ విషయంలో గొడవ పడ్డారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సోషల్ టీచర్ వారిని వారించి సాత్విక్‌ను పక్కకు నెట్టగా, కుడిచేయి ఎముక పగుళ్లు బారింది. ఆయనకు కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కట్లు కట్టించారు. దీనిపై ప్రిన్సిపాల్ అనిత వివరణ ఇస్తూ విద్యార్థి చేతి ఎముక విరినట్లు తన దృష్టికి వచ్చిందని, వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం : రైతులు సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ నెల 17న సాక్షిలో ఆరుగాలం.. దళారుల పరం.. సోయాబీన్ పంట అమ్మేందుకు రైతులకు తిప్పలు అనే కథనం రావడంతో అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ ప్రారంభించారు.

నేడు ఉచిత చేప పిల్లల పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో వేయడానికి 100 శాతం సబ్సిడీపై మత్స్యకారులకు ఆదివారం చేప పిల్లలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో ఈ నెల 31 వరకు ఉచిత క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నారని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రతిమ ఫౌండేషన్ విజయ తెలిపారు. శనివారం మండలంలోని ఉచిత క్యాన్సర్ పరీక్షలు, అమ్మక్కపేటలోని టాటాస్ట్రైవ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు ఇచ్చే శిక్షణ కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతుంటారని అటువంటి వారు వెంటనే పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. అమ్మక్కపేటలో ప్రతిమ ఫౌండేషన్,టాటా స్ట్రైవ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు సోలార్, రిఫ్రిజేటర్, బ్యాంకింగ్ మొదలైన కోర్సుల్లో ఉచితంగా శిక్షణనిచ్చి ఉద్యోగాలను ఇప్పిస్తున్నారని, నిరుద్యోగులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో కోమురయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.



పెగడపల్లి: మండలంలోని బతికపల్లి బండరాయి గుట్ట నుంచి తరలిస్తున్న గ్రానైట్ రాయితో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్దపెద్ద గ్రానైట్ రాళ్లను లారీల్లో తరలిస్తున్న లారీలను చూస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాళ్ల తరలింపు సమయంలో రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో రాళ్లు కింద పడితే ప్రమాదం జరిగే వకాశం ఉంది. అంతే కాకుండా ఓవర్‌లోడ్ అధిక బరువుతో రాళ్లను తీసుకెళ్తున్న క్రమంలో రహదారి సైతం దెబ్బ తింటొంది. అధికారులు చూసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవికిరణ్, ఎస్సై, పెగడపల్లి, సెల్ నంబర్: 8712656832

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

'రైతు భరోసా ఉన్నట్టా.. లేనట్టా..'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎకరాన రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రైతులకు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని, ఎప్పుడిస్తారో చెప్పాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వానాకాలం పంట కోతలకు వచ్చిన రైతు భరోసా ఇవ్వలేకపోయారని, రుణమాఫీ ఆగస్టు 15లోపు చేస్తామని చెప్పి రూ.40 లక్షల కోట్లు మాఫీ చేశారని, మిగతా రైతులను మోసం చేస్తున్నారన్నారు. కేసీఆర్ హయాంలో రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పంట రాకముందే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారని, దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకెళ్లారన్నారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 420 హామీలు పెట్టి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు గట్టు సతీశ్, వొల్లం మల్లేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టాటా ఏస్, బైక్ ఢీ ఒకరికి తీవ్రగాయాలు

ధర్మపురి: ఎదురెదురుగా వస్తున్న టాటా ఏస్, బైక్‌లు ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బూరుగుపల్లెకు చెందిన బొమ్మకంటి రవి శనివారం ధర్మపురిలో పనులు చూసుకుని బైక్‌పై సాయంత్రం బూరుగుపల్లెకు వెళ్తున్నాడు. మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ఢీ కొట్టడంతో బైక్ కింద పడిపోగా బైక్‌పై ఉన్న రవి రోడ్డు పక్కన పడిపోయాడు. అతనికి కాళ్లు చేతులతో తీవ్రగాయాలు కాగా, 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రుణాలు చెల్లించడంలో రైతుల నిర్లక్ష్యం

సారంగాపూర్: దీర్ఘకాలిక రుణాలు చెల్లించడంలో రైతులు నిర్లక్ష్యం చేయవద్దని సహకార సంఘాల సేల్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వంశీ అన్నారు. శనివారం సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు సారంగాపూర్ సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణాలు 85 శాతం వసూళ్లు అయినట్లు తెలిపారు. కల్లెడ, బీర్‌పూర్, కొల్వాయి సహకార సంఘాలు 100 వసూళ్లు చేసినట్లు పేర్కొన్నారు. జగిత్యాల సంఘంలో 90 శాతం, ధర్మపురి, తిమ్మాపూర్ 80 శాతం దీర్ఘకాలిక రుణాలు రైతులు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జగిత్యాల కేడీసీసీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రాకేశ్, సీఈవో శివ, భూమేష్, వరుణ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

జాతీయ తృణధాన్యాల ఉత్పత్తి ప్రదర్శనలో జాబితాపూర్ మహిళ

జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ తృణధాన్యాల (మిల్లెట్స్)ఆహార పదార్థాల తయారీ ప్రదర్శనలో జగిత్యాల మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ధనలక్ష్మి మహిళా సంఘ సభ్యురాలు భారతపు శ్యామల తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో రాష్ట్రం నుంచి రెండు యూనిట్లు ఎంపిక కాగా, గద్వాల జిల్లా నుంచి ఒకటి, జగిత్యాల జిల్లా నుంచి ఒకటి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళను శనివారం జిల్లా, మండల సెర్ప్ అధికారులు అభినందించారు.

14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయింపు

మేడిపల్లి: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు ఏపీఎం అశోక్ తెలిపారు.

విద్యార్థులకు ఆపార్ ఐడీ

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు ఆపార్ ఐడీ నెంబర్ అవసరమని హెచ్ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోమటి కొండాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆపార్ ఐడీ నెంబర్ తీసుకునేందుకు తల్లితండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఆపార్ ఐడీ అనేది 2020 జాతీయ విద్యా విధానం ప్రకారం భారతదేశంలోని విద్యార్థులందరి కోసం రూపొందించినదని జీవితకాలం ప్రత్యేక 12అంకెల గుర్తింపు వ్యవస్థ అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, నర్మదారాణి, జోష్న విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

బీసీ జాగృతిసేవా అధ్యక్షుడిగా నరేందర్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం బీసీ జాగృతిసేవా అధ్యక్షుడిగా బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామానికి చెందినంద తోట నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీసీ జాగృతిసేవా ఉత్తర తెలంగాణ జోన్ ఇన్‌చార్జి జంగం సంతోష్ నరేందర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

రెడ్డి ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి

మల్లాపూర్: రెడ్డి ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా బద్దం శ్రీనివాస్‌రెడ్డి(కొత్తదాంరాజుపల్లి)నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి శనివారం శ్రీనివాస్‌కి నియమాక పత్రం అందించారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంది తిరుపతిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల మండల అధ్యక్షుడిగా కోల రాజు

రాయికల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కోల రాజును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోల రాజు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ప్రభుత్వం ఆదుకునేందుకు ఉద్యమిస్తామని తెలిపారు.

టీజీటీ హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో 6 నుంచి 10 వరకు హిందీ సబ్జెక్టు బోధించుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి హిందీ పండిట్ శిక్షణతో పాటు టెట్ క్వాలిఫైడ్ అయిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22న మోడల్ స్కూల్లో నిర్వహించే డెమోకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.